నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
సోమవారం | 27 మే 2024 | www.navatelangana.com

ఈతకెళ్లి ఇద్దరు యువకులు మృతి





నవతెలంగాణ-కంది

సంగారెడ్డి రూరర్ పోలీస్ స్టేషన్ సమీపంలోని మంజీర డ్యామ్‌లో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామానికి ఎమ్‌డి ఆశ్రాఫ్(16), సంగారెడ్డి పట్టణానికి చెందిన ఆఫ్రోజ్(16) అనే ఇద్దరు యువకులు ఆదివారం మంజీరా డ్యామ్‌లో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గిజిగాడి నైపుణ్యం.. చూడచక్కని దృశ్యం




నవతెలంగాణ-జిన్నారం

ప్రకృతిలో మనస్సుకు హత్తుకునే అందమైన చిత్రాలు ఎన్నో చూస్తుం టాం. అలాంటి ఓ దృశ్యమే ఆదివారం మండల కేంద్రమైన జిన్నారంలో 'నవతెలంగాణ' విలేకరి కంటపడింది. అందమైన ఆ దృశ్యాన్ని అందరికీ చూయి ంచాలని ఆయన ఫోన్‌లో దాన్ని బంధించారు. అదే.. ఓ తుమ్మ చెట్టు చిటారు కొమ్మల పైన గిజిగాడు(పిచ్చుకలు) అందంగా అల్లుకున్న గూళ్ల నిర్మాణం. చిన్నా చితక గరక తీగలతో పిచ్చుకలు అందంగా అల్లుకున్న ఈ గూళ్ళు.. అటు వైపుగా వెళ్తున్న ప్రజలందరినీ ఆకర్షిస్తున్నాయి. ఆ గిజిగాడి పనితనం ముందు నేటి ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంజనీరింగ్ పనితనం పోటీ పడగలదా? అంటూ ఆ పిచ్చుక గూళ్ళ నిర్మాణాన్ని చూసిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో అవినీతి జలగ....!





- ఎస్సీ కార్పోరేషన్‌లో భారీగా అవినీతి
- లబ్ధిదారుల నుంచి పైసా వసూళ్లు
- బట్టబయలైన జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అవినీతి బాగోతం
- ఈడీపై ఎంక్వైరీకి కలెక్టర్ ఆదేశం

నవ తెలంగాణ - సిద్దిపేట అర్బన్

సిద్దిపేట కలెక్టరేట్‌లో ఓ జిల్లా అధికారి అవినీతి జలగగా మారి పేద ప్రజలను పట్టి పీడిస్తున్నారు. పైసలిస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్పొరేషన్ రుణాలు అందుతాయని హెచ్చరిస్తూ ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేశారన్నారనే ఆరోపణలు ఆయనపై అనేకం వచ్చాయి. తాజాగా కలెక్టర్ స్పందించి ఆయనపై ఎంక్వైరీకి మరో అధికారిని నియమించారు. ఇంతకీ ఆ అధికారి ఎవరనేగా మీ అనుమానం. ఆయనే సిద్దిపేట కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్‌లో ఇంచార్జి ఈడీగా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్ రెడ్డి. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై 'నవ తెలంగాణ' ప్రత్యేక కథనం.

అన్నీ తానై

శ్రీరామ్ రెడ్డి.... ఆయనో అవినీతి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పొచ్చు. హైదరాబాద్ ఎనిమల్ హస్బెండరీలో విధులు నిర్వహించిన ఆయన వెటర్నరీ డాక్టర్‌గా సిద్దిపేటకు వచ్చారు. ఆ తరువాత జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్థానం ఖాళీగా ఉండటంతో ఏడాది క్రితం ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. అంతే ఇక ఒక్క ఏడాదిలో ఎస్సీ కార్పొరేషన్ ఖజానాను ఖాళీ చేశారు. అవును మీరు విన్నది నిజమే. మరీ ఆయన అంతలా ఎస్సీ కార్పొరేషన్ నిధులు దోచుకున్నారు. ఈఎస్ఎస్ (ఎకనామికల్లి సపోర్టెడ్ స్కీం)కింద ఒక్కొక్కరి వద్ద రూ.50 నుంచి రూ. లక్ష వరకు డబ్బులు తీసుకోని థర్డ్ పార్టీ కింద బ్యాంకు లింకేజీతో సంబంధం లేకుండా సుమారు 30 మంది లబ్ధిదారులకు నిధులు మంజూరు చేసి వారి ఖాతాలో జమ చేశారు. ఎల్ పీఎస్ స్కీం కింద అనుమతి లేకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకుండానే బోర్లు మంజూరు చేసి బోరు మోటార్లు, కరెంటు మంజూరు చేసి వారి వద్ద నుంచి సైతం డబ్బులు లాక్కున్నారు. ఇక ఆర్టీఐ కింద సమాచారం కోరుతూ ఎవరైనా దరఖాస్తు చేసుకోవడానికి కార్యాలయానికి వస్తే అక్కడి నోటీస్ బోర్డు మీద అతని పేరు మినహా మిగతా పీఐఓ, ఏపీఐఓ అధికారుల పేర్లు కనిపించకుండా స్టిక్కర్ అతికించారు. ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే తనకు నచ్చినట్లుగా, తనకు అనుకూలంగా సమాచారం అందిస్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం లో 58, 59 జీవో కింద ఇండ్ల భూముల రెగ్యులరైజ్ ను ఇతనే నిర్వర్తించే వారు. లబ్ధిదారుల వద్ద సరైన పత్రాలు, ఇంటి గరి పట్టి ఉన్న లేకున్నా ఆయనకు పైసలు ముట్ట జెప్పాల్సిందే. ఒక్కక్కరి వద్ద రూ. 50 వేల వరకు వసూలు చేశారు. అంతేకాకుండా జిల్లా అధికారిగా విధులు నిర్వర్తించే వారు ట్యాక్స్ ప్లేట్ కలిగిన వాహనాన్ని వాడాలి. కానీ అతనికి మాత్రం ఆ నిబంధనలు వర్తించవు అన్నట్టుగా స్వంత వాహనాన్ని వినియోగిస్తున్నారు. టాక్స్ ప్లేట్ వాహనానికి నెలకు రూ. 33 వేల కంటే ఎక్కువ బిల్లు పెట్టడానికి వీలు లేదు. కానీ అతను మాత్రం నెలకు రూ 50 వేల బిల్లు పెట్టుకొని నిధులు మంజూరు చేయించుకున్నారు. ఇలా ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేయడమే కాకుండా లబ్ధిదారుల వద్ద సైతం భారీగా సొమ్ము చేసుకున్నారు.



ఈడీపై ఎంక్వైరీకి కలెక్టర్ ఆదేశం...

సిద్దిపేట కలెక్టరేట్ లో అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పేట్రేగిపోతోంది. రోజురోజుకూ ప్రజలను పీడించే అవినీతి జలగలు ఎక్కువవుతున్నాయి. దీన్ని అరికట్టకపోతే పెను ప్రమాదమే. గ్రహించిన జిల్లా కలెక్టర్ ఆ అవినీతి తిమింగలం పై ఎంక్వయిరీ కి ఆదేశించారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ లో ఇంచార్జి ఈడీ గా విధులు నిర్వహిస్తున్న శ్రీరామ్ రెడ్డి పై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ చేయాలని ప్రత్యేక ఎంక్వయిరీ కమిటీ వేశారు. ఆ కమిటీ అధికారిగా డీఆర్వోని నియమించారు. జూన్ 5వ తేదీ లోగా విచారించి అందుకి సంభందించిన సమాచారాన్ని తనకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఆయనపై ఎంక్వయిరీ కమిటీని వేస్తున్నట్టు ఒక జీవో వసూలు చేశారు. ఇక విషయం తెలుసుకున్న దళిత బిడ్డలు ఆ అధికారిపై మండిపడుతున్నారు. అవును ఆయనో పెద్ద అవినీతి తిమింగలం, తమ వద్ద భారీగా డబ్బులు వసూలు చేశారని చెబుతున్నారు. అలాంటి అధికారి తమకొద్దంటూ... ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక కలెక్టర్ కార్యాలయం ఆయన పట్ల ఎలా స్పందిస్తుందో... ఆయనపై వేసిన కమిటీ ఎలా విచారణ చేపడుతుందో వేచి చూడాలి.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంచాలి



నవతెలంగాణ-సిద్దిపేట

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ముందుకు వెళ్తే ఎన్నికలను అడ్డుకుంటామని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో సామాజిక ఉద్యమనేత పోచబోయిన శ్రీహరి యాదవ్‌తో పాటు వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి విజయభేరీ సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చేతుల మీదుగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలన్నారు. లోక్‌సభ ఫలితాల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్, అధికార యంత్రాంగానికి సీఎం ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కులగణన, సామాజిక న్యాయం పేరుతో అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందిన కాంగ్రెస్ మారోసారి బీసీలను మోసం చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక మాట తర్వాత మరోమాట రేవంత్ రెడ్డి రెండు నాల్కల ధోరణిని తప్పుపట్టారు. కులగణన చేయకుండా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఆగమేఘాల మీద స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి కులగణన బిల్లుకు చట్టబద్ధత కల్పించి, శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించాలన్నారు. అలాగే కులగణన విధివిధానాల కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు బీహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అయినా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమైతే. జూన్ 8న ఇందిరాపార్కు దగ్గర వేలాది మందితో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని, అప్పుడు కూడా మొండిగా ముందుకు వెళ్తే, జూన్ 15న బీసీ, కుల సంఘాలతో సెక్రటేరియట్‌ను దిగ్బంధిస్తామని ప్రకటించారు. దశాబ్దాల సామాజిక వర్గాల న్యాయమైన డిమాండ్ సాధన కోసం తెలంగాణ తరహా మరో పోరాటానికి అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వీరశైవ బలిజ సంఘం పట్టణ అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ తరతరాలుగా ఏ ప్రభుత్వం వచ్చినా బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా మేలుకోకపోతే భావి తరాలు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ జనసభ తలపెట్టిన జూన్ 8న మహాధర్నా, 15న సెక్రటేరియట్ ముట్టడికి బీసీ సంఘాలు, కుల సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్వాలు నరేందర్ నాయి, టీ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, ఉమ్మడి మెదక్ జిల్లా అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు పయ్యావుల రాములు యాదవ్, గౌడజన హక్కుల పోరాట సమితి జనరల్ సెక్రటరీ జి సంతోష్ గౌడ్, పద్మశాలి సమాజం శ్రీనివాస్ నేత తదితరులు పాల్గొన్నారు.

విధులు ప్రభుత్వ శాఖలో.. జీవనం అప్పులతో..



- ఆర్థిక అవస్థలు పడుతున్న కంప్యూటర్ ఆపరేటర్ల కుటుంబాలు
- గత ఐదు నెలలుగా వేతనాలందించని ప్రభుత్వం
- జిల్లాలోని పలువురు ఆపరేటర్లు అప్పులు చేసి కుటుంబాల పోషణ
- గడ్డు దుస్థిలో జీవనం సాగిస్తున్నామని ఆపరేటర్ల మనోవేదన

నవతెలంగాణ-బెజ్జంకి

పేరుకే ప్రభుత్వ శాఖలో నిత్యం విధులు నిర్వహిస్తున్నామని..గత ఐదు నెలలుగా ప్రభుత్వం వేతనాలు అందించకపోవడంతో అప్పులతోనే కుటుంబాలను పోషించుకుంటూ ఆర్థికంగా గడ్డు దుస్థితి ఎదుర్కొంటున్నామని జిల్లాలోని పలువురు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు మనోవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఐదు నెలలుగా ఈ గ్రామపంచాయతీ ఆపరేటర్లకు ప్రభుత్వం జీతాలు అందించడం లేదు. ఆపరేటర్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలలుగా తమకు జీతాలు అందించకపోతే ఎలా బతకాలని కంప్యూటర్ ఆపరేటర్లు తమ అవేదనను వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పంచాయతీ వ్యవస్థను 2014 సంవత్సరంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభమైంది. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసేటప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని విబంధనలను రూపొందించింది. నిబంధనం ప్రకారం ఒక క్లస్టర్‌కు ఒక కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహించాలని ఉంది. ఒక క్లస్టర్‌లో 4 నుంచి 5 గ్రామపంచాయతీలు ఉండే విధంగా నిబంధనలు రూపొందించారు. ఇప్పుడు క్లస్టర్ విధానాన్ని ప్రభుత్వం ఎత్తివేసినట్టు అధికారులు తెలుపుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 499 గ్రామపంచాయతీలకు సుమారు 82 మంది కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులను నిర్వర్తిస్తున్నారని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ విధానం ప్రకారం సుమారు 120 మంది కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వర్తించాల్సి ఉండగా కేవలం 82 మంది మాత్రమే జిల్లాలో కంప్యూటర్ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారంటే వీరిపై పని భారం ఎంత పడుతుందో అర్థమవుతుంది. వీరికి నెలకు రూ.22,750 ప్రభుత్వం వేతనంగా అందజేస్తోంది. బెజ్జంకి మండలంలో 23 గ్రామపంచాయతీల్లోని పనులకు ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. అధిక పని భారం మోపుతున్న ప్రభుత్వ మాత్రం వారికి నెలవారిగా క్రమం తప్పకుండా వేతనాలు అందించడం లేదు. వేతనాల్లేక ఆపరేటర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

విధులు బారేడు.. జీతం జానెడు...

గ్రామపంచాయతీలలో పుట్టిన, వివాహ, మరణ ధృవీకరణ పత్రాల జారీ, ఇంటి పన్ను, పంపు బిల్లులు, రసీదులు ఆన్ లైన్ చేయడం, గృహనిర్మాణం, వ్యాపారం, పన్నులు నమోదు, సెల్ టవర్ నిర్మాణం, లే అవుట్, పంచాయతీ అవార్డులు, మిషన్ అంత్యోదయ, గ్రామ పంచాయతీ చేసిన పనుల వివరాలు, పంచాయతీ ఆదాయ, వ్యయ లెక్కల నమోదు,అభివృద్ధి పనులు రికార్డులను సిద్ధం చేయడం,అసెంబ్లీ,పార్లమెంట్,గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధులను కంప్యూటర్ ఆపరేటర్లు నిర్వహిస్తున్నారు. ఎన్నికల పనులు, సీవీఆర్,డీపీఓ,మండల స్థాయిలో వివిధ రకాల నివేదికలతో పాటు చాలా రకాల పనులు కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా చేయిస్తున్నారు. ఇవన్నీ ఒక గ్రామ పంచాయతీ చేయాల్సిన పనులు.జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రతి కంప్యూటర్ ఆపరేటర్ ప్రతిరోజు 10 గ్రామపంచాయతీ పనులు చేస్తున్నారని సమాచారం. కొన్ని పంచాయతీలలో పది నుంచి 15 పంచాయితీల పనులను కూడా ఒక కుప్యూటర్ ఆపరేటర్ చేతనే అధికారులు చేయిస్తున్నారని వినికిడి. కంప్యూటర్ ఆపరేటర్లు కష్టాలు పడుతూనే విధులు నిర్వహిస్తున్నారు. పని భారం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్లు ప్రస్తుతం పని చేయకపోతే గ్రామపంచాయతీ పరిపాలన వ్యవస్థ మొత్తం కుప్పకూలే ప్రమాదం ఉంది. గ్రామపంచాయతీ పరిపాలనలో పట్టుకొమ్మలుగా ఉంటున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఐదు నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో విధులు బారేడు..జీతం జానెడు అనే చందంగా మారింది.

నిత్యం సమస్యలు, పని భారమే..

కంప్యూటర్ ఆపరేటర్లకు పనికి తగిన జీతం ఇవ్వటం లేదు. ఈ జీతాలు గ్రామ పంచాయతీల నుంచి చెల్లిస్తున్నారు. గ్రామపంచాయతిలో నగదు నిల్వలేకపోతే నిధులు పడేవరకు వేచి చూడాల్సిందే. ఒక వేళ కొన్ని నెలలు తర్వాత నిధులు పడినా జీతం తీసుకోవడానికి న ర్పం చ ు ల న ు , పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారుల దయాదాక్షిణాలపై ఆధారపడవలసిందే. వారు చెప్పినట్లు వినాలీ వారు ఇచ్చినప్పుడే తీసుకోవాలి. ఇది కంప్యూటర్ ఆపరేటర్ల దుస్థితి. కాదని అత్యుత్సహం ప్రదర్శిస్తే కంప్యూటర్ ఆపరేటర్ల పని అంతే. దినదిన గండంతోనే విధులు నిర్వహిస్తున్నామని తమకు మించిన భారం పనులను చేయిస్తున్నా చేస్తున్నామని చేసిన పనికి సకాలంలో అధికారులు జీతాలు చెల్లించడంలేదని కంప్యూటర్ ఆపరేటర్లు అవేదన చెందుతున్నారు.

డిమాండ్లు..

ఈ పంచాయతీ కంప్యూటర్లను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలి. పే స్కేల్ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలి. అధిక పని భారం నుంచి విముక్తి కల్పించాలి.

అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం

ఈ పంచాయితీ కంప్యూటర్ ఆపరేటర్లు, బెజ్జంకి.

ఐదు నెలలుగా అరకోర వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఐదు నెలలుగా అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకునే పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. నెలల తరబడి కడుపు మాడ్చుకుని విధులు ఎలా నిర్వహించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు వేతనాలందించి ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధులున్న పంచాయితీలో వేతనాలు

పురుషోత్తం, డీపీఎం సిద్దిపేట.

నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పంచాయితీలకు నిధులు కేటయించలేదు. నిధులున్న మేజర్ పంచాయితీల్లో ఎంపీడీఓ, పంచాయితీ కార్యదర్శుల సమన్వయంతో కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలు అందించవచ్చు. ప్రభుత్వం పంచాయితీలకు నిధులు కేటయిస్తే వేతనాలందించడానికి మార్గం సుగమవుతుంది.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

- పార్టీ రాజకీయ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కేవలం పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని గత చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రనేనని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ అన్నారు. ఆదివారం సిపిఎం సిద్దిపేట అర్బన్ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను సిపిఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం "కమ్యూనిస్టు ఉద్యమ విశిష్టత-పార్టీ నిర్మాణం" అంశంపై పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ బోధించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్ర మొత్తం గమనిస్తే ప్రజా సమస్యల పరిష్కారం కావడానికి, ప్రజలను కష్టాల నుంచి విముక్తి గావించింది కేవలం పోరాటాలు మాత్రమేనన్నారు. మానవ సమాజ పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే నాటి ఆదిమ సమాజం నుంచి నేటి సమాజం వరకు చరిత్ర మొత్తం వర్గ పోరాటాల చరిత్రేనన్నారు. ఈ పోరాటాల ద్వారానే ప్రజలు తమ బాధలు, కష్టాల నుంచి విముక్తి అయ్యారని అదే సమాజ మార్పునకు కూడా దోహదపడిందని తెలిపారు. దోపిడి పై పోరాటం చేయడం ద్వారానే కష్టజీవులకు విముక్తి లభించింది అని ఆ వర్గ పోరాటాలను ఉధృతం చేయడం ద్వారానే మానవాళికి సమస్యల పరిష్కారానికి విముక్తి కలుగుతుందని గత పోరాటాల చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రనని అన్నారు. నేడు పాలకవర్గాలు ఎన్నికలకు ముందు ఒక మాట ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడుతూ పేదలకు అనేక హామీలు ఇచ్చి ఆ హామీలు అమలు చేయకుండా ప్రజల్ని పదే పదే మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కేవలం పాలకులు మారినంత మాత్రాన సమస్యలు పరిష్కారం కావని విధానాల ప్రాతిపదికన ప్రజలు చైతన్యవంతులై ఎన్నుకోవడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. ఎన్నికలకు ముందు అధికారం కోసం అలవికాని హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజల్ని మరింత కష్టాల్లోకి పేదరికంలోకి నేడుతున్నారని దీని కారణం అధికారంలోనున్న పాలకవర్గాలు ఎవరి వర్గ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయో అర్థం చేసుకోలేనంత కాలం ప్రజలు పదేపదే మోసపోతారని తెలియజేశారు. కమ్యూనిస్టు ఉద్యమం పీడిత ప్రజల విముక్తి కోసం కష్టజీవుల రాజ్యం కోసం అనేక త్యాగాలతో ప్రజలకు అండగా నిలబడుతుందని ప్రజల ను కష్టాల నుండి విముక్తి చేయాలంటే కేవలం సమ సమాజం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని అది కమ్యూనిస్టుల పోరాటాల ద్వారానే ప్రజలు విముక్తి అవుతారని తెలియజేశారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో స్వతంత్ర పోరాటంలో కమ్యూనిస్టులు దేశ ఐక్యత కోసం సమగ్రత కోసం స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) అని తెలియజేశారు. కమ్యూనిస్టు కార్యకర్తలు కష్టజీవులను ఐక్యం చేసి వారిని పోరాటాలలో సమీకరించడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని, రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం బలమైన పోరాటాలు నిర్మించాలని అందుకు కార్యకర్తలు చైతన్యవంతంగా ప్రజల్ని సమీకరించాలని ప్రజా పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, సిపిఎం అర్బన్ మండల పార్టీ కార్యదర్శి చొప్పరి రవికుమార్ ప్రసంగించారు. ఈ శిక్షణా తరగతులకు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాలిగపు శిరీష ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. తరగతుల్లో మామిడాల కనకయ్య, సిపిఎం నాయకులు కొండం సంజీవ్,బాలమణి, దండు లక్ష్మి, రాజ నర్సు, మల్లయ్య అనిత, నరసింహులు, రాజు, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు





అగ్ని ప్రమాద గోడౌన్‌ను పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-గుమ్మడిదల



మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో గల మైత్రి డ్రగ్స్ పరిశ్రమ ఎదురుగా ఏర్పాటు చేసిన అక్రమ స్క్రాప్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలిసి తహసీల్దార్ గంగాభవాని ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఘటన స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. శనివారం సాయంత్రం కార్మికులు వెళ్లిపోయిన తర్వాత అగ్ని ప్రమాదం సంఘటన చోటుచేసుకుందని.. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేద న్నారు. ప్రస్తుతం నిల్వ ఉంచిన కెమికల్ డ్రమ్స్ స్క్రాప్ పూర్తిగా అగ్నికి ఆహుతి అయిందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి స్క్రాప్ గోదాం యజమాని, కార్మికులు తదితరులున్నారు.

మృతుని కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కల్హేర్



మండలంలోని మీర్ఖాన్‌పేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త కూలి నాగయ్య రెండో కుమారుడు శేఖర్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో గాయపడి బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని ఎల్లవేళలా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రామ్‌సింగ్, ఎంపీటీసీ అంజయ్య సాగర్, తాజా మాజీ సర్పంచులు యాకూబ్, గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజు, వార్డు మెంబర్లు కూలి నాందేవ్, కురుమ అంజయ్య కూలి భీమయ్య, జాంగిర్ పటేల్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో మంత్రి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ గ్రామంలోని శ్రీ భూనీలా సమేత రంగనాథస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం పాల్గొని శ్రీ భూనీలా సమేత రంగనాథ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో 1992 నాటి కాలంలో దేవాదాయ శాఖ వారు విలీనం చేసుకున్న రుక్మిణీ, సత్యభామ సమేత చతుర్భుజ మురళీ కృష్ణుడి పంచలోహాల విగ్రహాలను తిరిగి శ్రీ రంగనాథ స్వామి దేవాలయానికి అందించి ఆ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన శాంతి పాఠం, యాగశాల ప్రవేశం, గరుడ హెూమం, ధ్వజారోహణం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్లు ఎస్. సురేందర్ గౌడ్, రంగా సురేష్, హరికృష్ణ గౌడ్, కోరబోయిన నాగరాజు, చందర్ నాయక్, దుర్గేష్, కోఆప్షన్ సభ్యులు అల్లే శ్రీకాంత్, ఆలయ నిర్వాహకులు రామ్నాథ్ శర్మ ప్రదీప్ గౌడ్, రామకృష్ణ, సత్యం, మల్లేశం, శ్రీనివాస్, భూమయ్య, కాంగ్రెస్ నాయకులు శివరాజ్, సత్యం, లక్ష్మణ్, చింతకుంట శివ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



బొల్లారంలో అక్రమ ఇంటి నెంబర్ల కేటాయింపు

- నిబంధనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా బడాబాబులకు కేటాయింపు
- తనకేది పట్టదన్నట్లుగా కమీషనర్ తీరు?

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీలో అక్రమ ఇంటి నెంబర్ల కేటాయింపు పెద్దఎత్తున జరుగుతున్నది. బడాబాబులకు ఇష్టా రీతిన నెంబర్ల కేటాయింపు జరుగు తున్నా మున్సిపల్ కమిషనర్ పట్టించు కోకపోవడం పెద్దఎత్తున విమర్శలకు దారితీస్తున్నది. కమిషనర్‌కు తెలియకుండా ఈ వ్యవహారం జరుగుతుందా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. పేదలకు సంభందించిన ఇంటి నిర్మాణానికి అన్ని పత్రాలు సక్రమంగా ఉంటేనే ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారా లేక ఏదో ఒక లోపం నెపంతో నెంబర్లు నిలిపివేస్తున్నారా అనేది ప్రశ్నార్థకం. కేవలం కొందరు వ్యక్తుల ప్రమేయంతోనే ఈ అక్రమ నెంబర్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా అక్రమ వసూళ్లకు పాల్పడి బడాబాబులకు, వారి సిఫార్సులకు మాత్రమే తలొగ్గి ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారని బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి నెంబర్‌లు కేటాయించే సమయంలో పక్కాగా ఇంటి పత్రాలతో పాటు నిర్మాణానికి సంబంధించిన నమూనా చిత్రం, సెట్‌బ్యాక్ అన్ని స్వయంగా పరిశీలించి ఇంటి నెంబర్లు కేటాయించాలని.. కానీ మాముళ్లకు ఆశపడి అవేమీ లేకుండానే ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మున్సిపాల్టీలో అడ్డగోడలుగా ఇచ్చిన ఇంటి నెంబర్ల కేటాయింపు విషయంలో విచారణ జరిపి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



జోగిపేట లయన్స్‌క్లబ్‌ను మొదటి స్థానంలో నిలపాలి

నవతెలంగాణ-జోగిపేట

లయన్స్ క్లబ్ ద్వారా సేవలను విస్తరింపజేసి జోగిపేట క్లబ్‌ను జిల్లాలోనే మొదటి స్థానంలో నిలపా లని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్‌గౌడ్ అన్నారు. ఆదివా రం జోగిపేట లయన్స్ భవన్‌లో నూతన కార్యవర్గాన్ని సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్ ద్వారా సేవలను అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమన్నారు. సేవే లక్ష్యం గా లయన్స్ క్లబ్ ఏర్పడిందన్నారు. నూతన కార్యవర్గం లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ క్లబ్ సూ చించిన విధంగా క్యాలెండర్ ఆధారంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని సూ చించారు. గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్‌క్లబ్ సేవలను విస్తరించాలన్నారు. నూతన అధ్యక్ష, కార్యద ర్శులు అల్లెశ్రీకాంత్, మధుసూధన్‌రెడ్డి, కోశాధికారి గడ్డమీది జసంతోష్‌కుమార్, జిల్లా క్లబ్ సెక్రటరీ డాక్టర్ కే. అనంతరెడ్డి, జోన్ చైర్మన్ రామకృష్ణలను సన్మా నించారు. మాజీ లయన్స్‌క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్‌గౌడ్‌ను నూతన అధ్య క్షుడు శ్రీకాంత్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ రీజియన్ చైర్మన్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, చార్టర్ క్లబ్ సభ్యుడు ఎస్.నారాయణరెడ్డి, అందోలు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు, మాజీ లయన్స్ అధ్యక్షుడు రాంబాబు, మాజీ అధ్యక్షులు ఎం. పద్మనాభరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, జగదీశ్వర్, సభ్యులు మాణిక్‌రెడ్డి, విఠల్‌రావు తాండ్లే, బస్వ దయానంద్ పలువురు పాల్గొన్నారు. .

కరెంట్ డిపార్ట్మెంట్ పేరుతో వచ్చే ఫేక్ కాల్స్ నమ్మొద్దు

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల కరెంట్ డిపార్ట్మెంట్ పేరుతో కొంతమంది దొంగలు ఫోన్‌చేసి.. కంప్యూటర్ జాబ్స్ ఉన్నాయని మోసం చేస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మొద్దని అందోల్ మండల కరెంటు ఏఈ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.30,000 జీతం ఇస్తామని అని చెప్పి, అప్లికేషన్ ఫీస్ రూ.1400 పంపమని అడుగుతున్నారన్నారు. అలాంటి అవాస్తవ మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ విషయంలో కొంతమందికి కాల్స్ వెళ్లగా తమను సంప్రదించారని, అలాంటిదేమీ లేదని మీరు ఎవరికి డబ్బులు కట్టనవసరం లేదని సూచించినట్టు తెలిపారు. ఈ విషయంలో జోగిపేట సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. 9491595193 నుంచి ఎవరికైనా ఫోన్ కాల్స్ వస్తే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సొసైటీలో సబ్సిడీ విత్తనాలు వచ్చేనా ?

నవతెలంగాణ-న్యాల్‌కల్

వానకాలం ఖరీఫ్ పంటల సాగు సమీపించింది. అయినా ఇప్పటివరకు సోయాబీన్ సబ్సిడీపై ఎలాంటి స్పష్టత రాలేదు. ప్రభుత్వం తప్పనిసరిగా సోయాబిన్ విత్తనాలను సబ్సిడీ ద్వారా అందించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. తొలకరి వర్షాలు పడగానే విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధంగా ఉన్నామని.. ఇప్ప టికైనా సోయాబిన్ విత్తనాలు రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కంపోస్టు జాడేది..?

- నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు
- ఎక్కడా కనిపించని కంపోస్టు తయారీ
- ఎరువుల తయారీపై కొరవడిన అవగాహన
- డిపిఓ ఆదేశించినా పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ఝరాసంగం



గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సెగ్రి గేషన్ షెడ్లను నిర్మించింది. ప్రతి వీధులో ఇంటింటికీ తిరుగుతు సేకరించిన చెత్త ద్వారా తయారు చేసిన ఎరువులను గ్రామంలోని రైతులకు విక్రయించి పంచాయతీల ఆదాయం పెంచాలని భావించింది ప్రభుత్వం. అంతే కాకుండా దీనికితోడు గ్రామాల్లో పారిశుద్ధ్యంతో పాటు స్వచ్ఛతను మెరుగు పరిచే అవకాశం ఉంటుందని ప్రభుత్వం ముందు చూపుతో ఆలోచన చేసింది. అయితే ఆచరణలో మాత్రం సెగ్రి గేషన్ షెడ్లు ముందడుగు పడడంలేదు. మండల పరిధిలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.ప్రతి పంచాయతీకి ఒక షెడ్డును ప్రభుత్వం మంజూరు చేసింది. అన్ని పంచా యతీ లో నిర్మాణాలు పూర్తయినప్పటికీ కంపోస్టు ఎరువుల తయా రీ అంతంతమాత్రంగానే ఉంది. దీనికితోడు సేకరించిన చెత్తను ఖాళీ స్థలాలు, డంపింగ్ యాడ్ లలో పడేస్తూ తగల బెడుతు న్నారు తప్ప సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించ డం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



ప్రజా ధనం వృథా...

ప్రతీ పంచాయతీలో ఒక్కో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూపాయలు 2.50 లక్షలు ఖర్చు చేస్తోంది. డంపింగ్ యార్డు ల నుంచి మీరు చేసిన తడి పొడి చెత్తలను వేరువేరుగా పోగుచేసి సేంద్రీయ ఎరువు తయారు చేసే విధానం పై పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. పంచాయతీ కార్మికులకు అవగాహన లేకపోవడంతోనే చెత్త డంపింగ్ యార్డులకు తరలించి తగలబెడుతున్నరని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం లక్షలు వెచ్చిం చి నిర్మించిన సీట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. అం తేకాకుండా ఆయా గ్రామాల లోని ఊరు చివరలో ఉన్న షెడ్ల లో రాత్రి వేళల్లో ఆకతాయిలకు, మద్యం ప్రియులకు అడ్డాలుగా మారాయని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం వీటిపై ప్రత్యేక నిఘా ఉంచి ఉపయోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.



ఊరి బయటే డంపింగ్..

నిత్యం ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే ఎక్కువశాతం పంచాయతీల్లోని కంపోస్టు షెడ్లలో వ్యర్థాలను వేరు చేసే పనులు జరగడం లేదు. వచ్చినది వచ్చినట్లే కుప్పగా ఒకే చోట పోయడంతో షెడ్లలో వేర్వేరు అవసరాల కోసం నిర్మిం చిన స్థలాలు ఖాళీగా ఉంటున్నాయి. కొన్ని గ్రామ పంచాయ తీల్లో తడిచెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేస్తుండగా. . పొడి చెత్తలో లభించే ప్లాస్టిక్, గాజు, ఇనుము, ఇతరత్రా వాటిని వేరు చేయడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. కొ న్ని గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను ఊరు బయట డంప్ చేస్తున్నారు. కంపోస్టు షెడ్లలో చెత్తను వేరు చేయడం లేదు. మరికొన్ని చోట్ల డంపుచేసిన చెత్తకు నిప్పు అంటి స్తు న్నారు. అంటుకున్న నిప్పుతో రోజుల తరబడి మం టలు, పొ గలు వ్యాపిస్తున్నాయి. గ్రామానికి దూరంలో డంప్‌చేస్తున్న చెత్త గాలికి కొట్టుకుపోయి సమీప పొలాల్లోకి చేరుతుంది. దీంతోఇబ్బందులునెలకొంటున్నాయనిరైతులు వాపోతున్నారు.

చెత్త సేకరణకే పరిమితం..

గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చేలా సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను సేకరించిన పారిశుధ్య సిబ్బంది కంపోస్టు షెడ్లకు తరలిస్తారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేయాలి. తడి చెత్తలో సేంద్రియ ఎరువును తయారు చేయాలి. పొడి చెత్తలోని ప్లాస్టిక్, ఇనుము తదితర వస్తువులను వేరు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం పెంచుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఎందుకూ పనికిరాకుండా ఉన్న వస్తువులను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇలా వ్యర్థాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేవిధంగా చూడాలి. వీటి నిర్వహణ లోపంతో చెత్త సేకరణకే పరిమితమయ్యాయి. సేంద్రియ ఎరువులు తయారు చేస్తేనే పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరే ం అవకాశం ఉంటుంది. కానీ ఎక్కడా ఈ ప్రక్రియ జరుగుతున్నట్లు కనిపించడం లేదు. మరోపక్క పంచాయతీ కార్మికులకు కంపోస్ట్ జరుగు తయారి విషయంలో ఎలాంటి అవగాహన లేదని తెలుస్తోంది. మండల అధికార పనితీరును పరిశీలిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎస్ సాయిబాబా మండలంలో గత రెండు రోజుల క్రితం కప్పడ్,ఝరా సంగం గ్రామాలను క్షేత్ర స్థాయిలో సిగ్రిగేషన్ ను పరిశీలించారు. అక్కడి పరిస్థితులను,వాటి పనీతీరును,అధికారుల పర్యవేక్షణ ఎలా కొనసాగుతుంది అనే అంశాలపై ఆరా తీశారు. ఇందులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతున్నాయి.

అధికారులపై చర్యలు తీసుకుంటాం

షెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్ట్ ఎరు వుల తయారీ విధానం పై పంచా యతీ అధికారులకు ఆదేశించాం. అన్ని పంచా యతీల్లో ఎరువులు తయారు చేసేలా చ ర్యలు తీసుకుంటాం. ప్రతి పంచాయతీ లో సిబ్బందిలో మార్పు వచ్చే విధంగా ప్రయత్నిస్తున్నా ం. అన్ని గ్రామాల్లో కంపోస్టు ఎరువు తయారును ప్రారంభిస్తున్నాం.

- సుధాకర్ ఎంపీడీవో, ఝరాసంగం

పాఠశాలల్లో నత్తనడకన పనులు..

- బడులు ప్రారంభం అయ్యేవరకు పూర్తవడం కష్టమే..
- ఇబ్బంది పడనున్న విద్యార్థులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

జూన్ 12 తేదీన పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. అయితే 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు నత్తనడకన సాగుతుండడంతో.. విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. చాలా చోట్ల మరుగుదొడ్లు కూడా పూర్తికాని దుస్థితి నెలకొన్నది. పదిహేను రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్న ఈ సందర్భంలో మౌలిక వసతులు కూడా లేకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 69 పాఠశాలలు ఉన్నాయి. అందులో 36 పాఠశాలలు 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' కింద



మంజూరయ్యాయి. కాగా 4897 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాలలు' కార్యక్రమాన్ని చేపట్టినా.. పనులు మాత్రం నత్తనడకన జరుగుతున్నాయి. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, గదుల మరమ్మతులు లాంటి పనులు ఈ కార్యక్రమం కింద జరుగుతున్నాయి. జూన్ 5వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని ఆదేశాలున్నా.. చాలా చోట్ల పనులు మెల్లగా సాగుతున్నాయి. మరో పదిహేను రోజుల్లో బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పనులు వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోపక్క బిల్లులు రావడం లేదని.. అందుకే జాప్యం జరుగుతున్నదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నిధుల సమాచారం కోసం పంచాయతీ రాజ్ ఏఈని ఫోన్ ద్వారా సంప్రదించాలని చూడగా.. స్పందించలేదు.



కార్మికుల కనీస వేతనాలు అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం

నవతెలంగాణ-సంగారెడ్డి



కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని.. 73 షెడ్యూల్ ప్రకారం పరిశ్రమలో కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలు కనుగు ణంగా సవరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బీరం, మల్లేశం అన్నారు. కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం జరిగిన సీఐటీయూ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. కార్మిక వర్గానికి బీజేపీ 10 ఏండ్లుగా ఏమి చేయలేదన్నారు. ఫ్లోర్ లెవెల్ మినిమం వేజ్ రోజుకు రూ.178గా బీజేపీ నిర్ణయించడం దారుణమన్నారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను సవరించి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చిందన్నారు. ఈ కోడ్‌ల వల్ల కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు కోల్పోతాంన్నారు. సమ్మె హక్కు కాల రాయబడిందని, 8 గంటల పని 12 గంటలకు మార్చారన్నారు. కోట్లాదిమంది అసంఘటితరంగా కార్మికులకు వర్తించే ఈపీఎఫ్ పెన్షన్ నెలకు పదివేలు పెంచాలని బీజేపీకి మనసొప్పడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించడానికి అంగీకరించడం లేదన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చి ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు వేల కోట్ల లాభాలు కట్టబెట్టేందుకు తెగబడిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు బాటలు వేసిందని మండిపడ్డారు. గడచిన పదేళ్లలో 1,30,000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో మోడీ పార్లమెంటు సాక్షిగా కనీసం మద్ద తు హామీ ఇచ్చి అమలు మార్చారన్నారు. ప్రతీఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న హామీ అటకెక్కిందన్నారు. 30 లక్షల ఖాళీలు ఉన్నా.. భర్తీ మాత్రం చేయలేద న్నారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యవసర వస్తువుల చార్జీలు విపరీతంగా పెంచారని మండిపడ్డారు. నల్లధనాన్ని వెనక్కి తెచ్చి పేదల బ్యాంక్ అకౌంట్లో 15 లక్షలు డిపాజిట్ చేస్తానన్న వాగ్దానం మర్చిపోయారన్నారు. హిందూ- ముస్లింలు ఘర్షణలు పెంచుతున్నదన్నారు. ఎలక్షన్ బాండ్స్ 16 వేల కోట్ల రూపాయలు వస్తే అందులో 8262 కోట్ల రూపాయలు కేవలం బీజేపీ ఖాతాలోనే పడిందన్నారు. బీజేపీ గెలవడం అంటే రాబోయే కాలంలో కార్మికులకు సంఘాలు ఉండవని.. సమ్మె హక్కు కూడా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య జిల్లా ఉపాధ్యక్షులు బాగారెడ్డి, ప్రవీణ్ సహాయ కార్యదర్శి ఎం, యాదగిరి నాయకులు నాగభూషణం, శ్రీనివాస్, సువర్ణ, రమాదేవి, మంజుల, రాజు, నర్సింలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు

అదనపు డీఆర్‌డీఓ జంగారెడ్డి

నవతెలంగాణ-సదాశివపేట

ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలబాలికలకు యూనిఫామ్స్ త్వరగా ఇవ్వాలని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తున్నదని, ఇందులో భాగంగా మహిళా సంఘాలకు స్కూల్స్ యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను అప్పగించిందని అదనపు డీఆర్‌డీఓ జంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆత్మకూర్ లో ఏర్పాటు చేసిన బాల బాలికల స్కూల్ యూనిఫామ్స్ కుట్టు కేంద్రాన్ని డీపీఎం శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ.. డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలబాలికలకు స్కూల్ యూనిఫామ్స్‌ను డ్వాక్రా గ్రూప్ సభ్యుల ద్వారా కుట్టి అందజేస్తారన్నారు. మండలంలోని 45 పాఠశాలల 3497 మంది విద్యార్థులకు యూని ఫామ్స్ కేంద్రం ద్వారా ఇవ్వనున్నా రన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా స్వశక్తి కుట్టుమిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఎస్ హెచ్‌జి మహిళల ద్వారా స్కూల్ యూనిఫామ్స్ కుట్టించి ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయునట్లు తెలిపారు. సాధ్యమైనంత త్వరగా విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు ఇవ్వాలని సూచించారు. సకాలంలో యూనిఫాంలు కుట్టించి పాఠశాలలకు అందించాలని కోరారు. జూన్ 5లోగా యూనిఫామ్స్ సిద్ధం కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నర్సింలు, క్లస్టర్ అధికారి రవి, కేంద్రం నిర్వాహకులు సత్యమ్మ రాణి, పాఠశాల చైర్మెన్లు అమృతమ్మ, అమూల్య, నాగలక్ష్మి, సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-పుల్కల్

మండల కేంద్రంలోని ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం చేపట్టారు. 20 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉన్నదన్నారు. నాడు తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపి.. శాలువా, పూలమాలతో ఘనంగా సన్మాని ంచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏ ఒక్కరూ విద్య పట్ల అశ్రద్ధ వహించకుండా విజయాలను సాధించాలన్నారు. విద్యతోపాటు క్రీడల్లో మంచి గుర్తింపు తేవాలన్నారు. కాగా విద్యార్థులను ఆనాటి స్మృతులను జ్ఞాపకం చేసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని గుల్ల చేస్తున్న గనులు

- ఫిర్యాదు చేసినా పట్టించుకుని రెవెన్యూ సిబ్బంది
- జేసీబీలతో ఇష్టాతీరున తవ్వకాలు

నవతెలంగాణ-పుల్కల్



పుల్కల్ మండలంలోని విలువైన ప్రభుత్వ భూమిల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు జేసీబీల యాజమాన్యాలు రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు జరపుతున్నారు. దాంతో ప్రతీరోజు లక్షల రూపాయలను అక్రమంగా జేబులో వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో ఉన్న ఇరిగేషన్ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని విషయం తెల్సుకున్న స్థానిక విలేకర్లు.. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయినా ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం గమనార్హం. మరోపక్క జేసీబీ యజమాని.. 'మీరు ఏమైనా చేసుకోండి.. అడ్డు వస్తా జేసీబీలతో తొక్కిస్తా' అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని విలేకర్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌ను ఫోన్ ద్వారా సంప్రదించాలని చూడగా ఆయన అందుబాటులోకి రాలేదన్నారు. అధికారులు పూర్తిగా జేసీబీ యాజమాన్యంతో కుమ్మక్కై చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు కట్టకు ఎప్పుడైనా అత్యవసర సమయంలో మట్టి అవసరం ఉంటుందని ఉద్దేశంతో 1980లో అప్పటి అధికారులు ఇరిగేషన్ శాఖకు 400 ఎకరాల భూమిని రైతుల వద్ద అన్యాక్రాంతంగా తీసుకొని ఇరిగేషన్ శాఖ అధికారులకు అప్పజెప్పారు. అయితే ఆ భూముల్లో కొందరు కాంట్రాక్టర్లు రాత్రింబవళ్లు జేసీబీల సాయంతో భూమిని గుల్ల చేస్తు న్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరి ంచడం గమనార్హం. పేదల నూతన ఇంటి నిర్మాణంలో మట్టి అవసరం పడితే అధికారులు మామూళ్ల అడుగుతున్నారని.. అదే పలుకుబడి ఉన్న వ్యక్తులకు మాత్రం శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు మట్టి తరలించుకోమని సూచిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి.. అక్రమంగా మట్టి తవ్వుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూరింట్లో నగదు నగలు దొంగతనం



నవతెలంగాణ-చిన్నశంకరంపేట

మండలంలోని ఎస్ కొండాపూర్ గ్రామానికి చెందిన పేరూరి బూధమ్మ నివాస పూరి గుడిసెలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం శనివారం బాధితురాలు బుూధమ్మ తన మనుమని పుట్టినరోజు ఉన్నందున ఇదే గ్రామంలో గల తన కుమారుని ఇంటి వద్దకు వెళ్ళింది. తెల్లవారి ఇంటి వద్దకు వచ్చి చూడగా తాళం వేసి ఉన్న నాగోసమును పనిముట్ల సహాయంతో తీసి ఇంట్లో చొరబడి డబ్బాలో గల తులం బంగారి గుండ్లు, అరతులం కమ్మలు, 20 తులాల వెండి, రెండు తులాల నల్లపూసల దండ, రూ. 11 వేల నగదును ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

దాడిని ఖండిస్తున్నాం



నవతెలంగాణ-నిజాంపేట

రామయంపేట మున్సిపల్ కౌన్సిలర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు గజవాడ నాగరాజ్‌పై దాడిని మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దయాకర్ తీవ్రంగా ఖండించారు. శనివారం రామాయంపేట పట్టణంలో గజవాడ నాగరాజుపై పోచమ్మల గణేష్ పెట్రోల్ పోసి హత్యాయత్నంకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రజాస్వామ్య పద్ధతిలో మాట్లాడుకోవాలి తప్ప హత్యాయత్నానికి పాల్పడడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలాగే దాడులు కొనసాగితే ప్రతి దాడులు తప్పవన్నారు.

గుట్కా నిషేదంపై ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గుట్కా తయారీ, విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు అన్నారు. ఇప్పటికే డ్రగ్స్ సప్లై చేస్తున్న వారిపై, విక్రయిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనావుందని ఉందన్నారు. రాష్ట్రంలో యువత మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ వంటి వారికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువతపై అలాంటి ప్రభావం పడకూడదని తీసుకున్న ఈ కీలక నిర్ణయం హర్షణీయమన్నారు. పకడ్బందీగా అమలు పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలిసీ తెలియక వీటి బారిన పడిన వారిని కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి అవగాహణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

మోడల్ స్కూల్లో అడ్మిషన్‌లు ప్రారంభం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల పరిధిలోని అక్కెనపల్లి మోడల్ స్కూల్లో అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు అక్కెనపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్ గౌడ్ తెలిపారు. అక్కెనపల్లిలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్లు తెలియజేశారు. 6,7,8,9,10 తరగతులలో ఏప్రిల్‌లో ఎంట్రెన్స్ పరీక్ష రాసిన విద్యార్థులతో పాటు పరీక్ష రాయని విద్యార్థులను కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈ నెల 28లోగా హాస్టల్ సీటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నేటి వరకు ఇంటర్ ఫస్టియర్ డే అండ్ రెసిడెన్షియల్‌లో 90 మంది అడ్మిషన్‌లు పొందారన్నారు. ఎంపీసీలో 40 సీట్లకుగాను 30 భర్తీ కాగా 10 సీట్లు మిగిలాయని, బైపీసీలో 40 సీట్లకుగాను 35 భర్తీ కాగా 5 సీట్లు మిగాలాయని, సీఈసీలో 40 సీట్లకుగాను 25 భర్తీ కాగా 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని మిగాలాయని చెప్పారు.

పోలింగ్ స్టేషన్లకు చేరిన ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బంది



నవతెలంగాణ-మద్దూరు

వరంగల్, ఖమ్మం, నల్లగొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మద్దూరు, దూల్మిట్ట, మండల కేంద్రాలలో ఏర్పాటుచేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నట్లు మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్, ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్గొండ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగే పోలింగ్‌కు ఎన్నికల సిబ్బంది హాజరైనట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎస్సై షేక్ యూనిస్ అహ్మద్ అలీ, ఆర్ ఐ లు రమేష్, ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోసం ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-చేర్యాల

వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేడు (సోమవారం) జరగనుంది. ఉప ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. చేర్యాల మండలంలోని 19 గ్రామాలలో మొత్తం 2555 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి చేర్యాల పట్టణంలోని పెద్దమ్మ గడ్డ ఎంపిపిఎస్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్ నెం.1 పరిధిలో 784 మంది పురుషులు, 474 మంది మహిళలు, పోలింగ్ నెం.2లో 902 మంది పురుషులు, 395 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో పలువురు రాజకీయ పార్టీల నుంచి పోటీ చేయగా, మరి కొంతమంది స్వతంత్రులుగా పోటీలో ఉన్నారు. సెక్టోరియల్ జోనల్ అధికారిగా ఎంపీడీవో మహబూబ్ అలీ నియమించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ పర్యవేక్షణ, చేర్యాల సీఐఎల్. శ్రీను ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని గెలిపించాలి



నవతెలంగాణ-మద్దూరు : ఈనెల 27వ తేదీన జరుగబోయే ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉమ్మడి మద్దూరు మండల బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ పాకాల కిరణ్ కుమార్ పట్టభద్రులను కోరారు. ఏనుగు రాకేష్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిస్తే నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తాడని ఆయన తెలిపారు.

ముంచుకొస్తున్న గడువు.. ముందుకు సాగని పనులు

- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అభివృద్ధి పనులు
- టాయిలెట్లు, తాగునీరు,విద్యుత్, సౌకర్యలపై ప్రత్యేక దృష్టి
- జూన్ 5వరకు పనులు పూర్తి చేయాలి.
- అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాలల ఏఇ నాగరాజ్ గౌడ్.







నవతెలంగాణ-పెద్దశంకరంపేట

మండలంలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు జూన్ 5లోపు పనులు పూర్తి చేయాలని డెడలైన్ ఉన్నపటికీ వివిధ కారణాలవల్ల మండలంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. దీంతో అప్పటిలోగా పనులు పూర్తిఅవుతాయా అనేదే ప్రశ్నర్థాకంగా మారింది. కాగా ప్రభుత్వం ఇటీవల ఈ కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టింది. పెద్దశంకరంపేట మండలంలో 28 పాఠశాలలకుగాను 16 పాఠశాలకు మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసింది. అందుకోసం గ్రామలోని మహిళ సంఘాలతో పాఠశాల హేచ్ఎంకు జాయింట్ చెక్‌పవర్ కట్టబెట్టి పనులు చేపట్టాలని నిర్వహించింది.. అయితే విద్యా సంవత్సరము గడువు ముంచుకోస్తున్న పాఠశాలలలో చేపట్టాల్సిన పనులు ఇంకా ముందుకు సాగడంలేదు. గత విద్యా సంవత్సరం పాఠశాలలో పనులు చేయాలని తీర్మానం చేసినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడంలేదు.

మండలంలో మొత్తం 27 గ్రామపంచాయతిలలో గత సంవత్సరం మనఊరు మనబడి అభివృద్ధి పనుల్లో 16 పాఠశాలలు మరమ్మతు పనులు చేపట్టారు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యా వైద్యంకు ప్రత్యేక నిధులు కేటాయించింది. అమ్మ ఆదర్శ కమిటీ పనులలో కమలాపురం జామున నాయక్ తండా బూర్గుపల్లి కొలపల్లి సంగారెడ్డి పేట మూసాపేట్‌తో మరో పది పాఠశాలలలో అరకొర పనులు సాగుతున్నాయి. చేపట్టాల్సిన పనులకు సంబంధించి 25 శాతం నిధులు అడ్వాన్స్‌గా ఇవ్వనునట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ నేటికీనిధులు విడుదల కాలేదు. దీంతో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన డెడ్ లైన్ (జూన్ 5 లోపు)వరకు పనులు పూర్తి కావడం అనేది కష్టాసాధ్యమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అలస్యంగా సాగుతున్నాయి
కేవీపీస్ నాయకులు తుకారం



పాఠశాలలలో మరమ్మతులు చేపట్టడంలో కమిటీల నిర్వాహకులు మహిళా సంఘాల వారు కీలకమైన వారు. వారికి కాంట్రాక్ట్ పనులపై అవగాహన ఉండదు. పైగా పనులు ముందుగానే చేసినా అనంతరం బిల్లులు తీసుకునేందుకు ఏంబిలు సమర్పించాల్సి ఉంటుంది. కానీ సంఘాల వారు తమకు ముందుగా అడ్వాన్స్ డబ్బులు ఇస్తే పనులు చేస్తామని తమ దగ్గర డబ్బులు లేవని చేతులేత్తేశారు. దీంతో గ్రామ కాంగ్రెస్ నాయకులకు ఈ పనులు అప్పగించి అడ్వాన్స్ కూడా ఇచ్చారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

పనులు చురుకుగా సాగుతున్నాయి
అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల ఏఈ నాగరాజ్ గౌడ్

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా గుర్తించిన పాఠశాలలో అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. జూన్ 5 వరకు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాము.

మండలంలో జోరుగా ఆమ్ చూర్



నవతెలంగాణ-నిజాంపేట

రాష్ట్రాల్లో, విదేశాల్లో వంటకాలలో చింతపండుకు బదులుగా వాడే ఆమ్ చూర్‌కు ఈ ఏడాది రూ.25 వేల ధర పలుకుతోందిని ఆమ్ చూర్ తయారీదారులు చెబుతున్నారు. వేసవికాలంలో రెండు నెలలపాటు ఉపాధి దొరుకుతుందని ఆమ్ చూర్ తయారీ చేసే మహిళలు అంటున్నారు. మెదక్ జిల్లాలో ఆమ్ చూర్‌ను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జనవరి నెలలో మామిడి తోటలను గుత్తా లెక్కన కొనుగోలు చేస్తారు. మామిడి కాయలు కోతకు రాగానే ఏప్రిల్, మే నెలల్లో కాయలను తెంపి కూలీలను పెట్టి మామిడి కాయల తొక్క తీసి, ముక్కలుగా కోసి బండలపై ఆరబోస్తారు. బాగా ఎండిన తరువాత అవి ఆమ్ చూర్‌గా తయారవుతాయి. వీటిని హైదరాబాద్‌లోని మలక్‌పేట, నిజామాబాద్ మార్కెట్‌లకు తీసుకెళ్లి హోల్ సేల్ వ్యాపారులకు అమ్ముతారు. అక్కడ వారు ఆమ్ చూరు కిలో, రెండు కిలోలు, ఐదు కిలోలు, పది కిలోల చొప్పున ప్యాక్ చేసి ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేస్తారు. మామిడి కాయలు కోతకు రావడంతో గత కొద్ది రోజులుగా ఆంచూర్ తయారీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆమ్‌చూర్‌ను ఏటా తయారు చేసి నిజామాబాద్ మార్కెట్‌కు తరలిస్తామని కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటాలు ఆమ్‌చూర్‌కు రూ.25వేలు పలుకుతోందని ఆమ్‌చూర్ తయారీ దారులు చెబుతున్నారు. జిల్లాలోని నిజాంపేట మండల పరిధిలో అమ్‌చూర్ ఎక్కువగా తయారు చేస్తారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో టంకర తయారీ ముమ్మరంగా జరుగుతోంది. మామిడి టంకర తయారీ ద్వారా ప్రతి ఏటా ఎండాకాలంలో దాదాపు రెండు నెలల పాటు కూలీలకు మంచి ఉపాధి లభిస్తుంది. ఊర్లోనే నీడ పట్టున కూర్చుని చేసే పని కావడంతో మహిళలు, పిల్లలు టంకరచూర్ తయారీ పనులకు వెళ్తున్నారు. వంద మామిడి కాయలు కోసి టంకర తయారు చేసినందుకు రూ.50 చొప్పున చెల్లిస్తున్నారు. ఒక్కొక్కరు రోజుకు 500 నుంచి 600 కాయలు కోస్తారు. బాగా అనుభవం ఉన్న వారు వెయ్యి కాయల వరకు కోసి ఆమ్ చూర్ తయారు చేస్తారని టంకర వ్యాపారులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించాలి

- అన్ని రకాల వడ్లను బోనస్ ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం



నవతెలంగాణ-మెదక్

వడ్ల కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో మూడు రోజుల పాటు కొనసాగనున్న సీపీఎం పార్టీ జిల్లా నాయకత్వ రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి కోతలు ముగిసినా ధాన్యం కుప్పలు ఇంకా కొనుగోలు కేంద్రాల వద్ద చాలా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు మాత్రమే రూ.500లు బోనస్ ఇస్తామని చెప్పి దొడ్డు వడ్లకు కల్పించక పోవడం అన్యాయమన్నారు. రైతులు పండించిన దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి కోతలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల దగ్గర ఉన్న వడ్లను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ధాన్యం వర్షాలకు తడిసి రైతు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన నిర్లక్ష్యాన్ని వదిలి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. నర్సమ్మ, కే.మల్లేశం, బస్వరాజ్, కమిటీ సభ్యులు సంతోష్, బాగయ్య, పార్టీ నాయకులు నర్సింలు, పుష్ప, శౌకత్, అభి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 108 పైలేట్ దినోత్సవం



నవతెలంగాణ-సిద్దిపేట

2005 సంవత్సరంలో స్థాపించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 108 పైలెట్ దినోత్సవం ఆదివారం కేకు కట్ చేస్తే ఘనంగా నిర్వహించినట్లు మెదక్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్ధన్ తెలిపారు. క్షతగాత్రులను హాస్పిటల్ చేరేవేసేవరకు విధి నిర్వహణలో వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎంతోమంది ప్రాణాలను పైలెట్లు కాపాడుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటేష్, పైలెట్లు తదితరులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-వెల్దుర్తి

మరపురాని బంధం చిన్ననాటి స్నేహం. స్నేహానికి ఆస్తులు అంతస్తులు అడ్డు రావు. అలనాటి స్నేహ తీపి జ్ఞాపకాలను జ్ఞాపకార్థం కలిసి పంచుకోవడానికి ఆదివారం మండల కేంద్రంలోని బాలాజీ గార్డెన్లో 1993-94 సంవత్సరం విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకుని 30 సంవత్సరాలు గడుస్తున్న తరుణంలో అలనాటి మిత్రులను కలుసుకోవడం కోసమే పూర్వ విద్యార్థి విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించామని అలనాటి మిత్రులు తెలియజేశారు. ఎన్ని పనులు ఉన్నా పక్కన పెట్టి అందరూ ఒకే హాల్లో కలుసుకొని జీవితంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థిని విద్యార్థుల సమ్మేళనానికి ఆనాడు బోధించిన ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్నా విద్యార్థుల సమ్మేళనానికి హాజరై వారి మాటల్లోనే సుఖసంతోషాలను బాధలను పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన నీల రమేష్ (40) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆదివారం మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి, 50 కిలోల బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు, వారితో పాటు కరుణాకర్, సుధాకర్, మ్యాకల శ్రీనివాస్, సిలివేరి శ్రీకాంత్, ప్రకాష్ తదితరులున్నారు.

నిరుద్యోగ యువకులకు డిఫెన్స్ రంగంలో సువర్ణవకాశం

- దేశ రక్షణలో సేవలందించడం గొప్ప అనుభూతి
- యువత చేతిలో దేశ ప్రజల భద్రత.
- నిరుద్యోగులకు ఆజాద్ డిఫెన్స్ అకాడమీ ఉచిత కోచింగ్



నవ తెలంగాణ -రాయపోల్

నిరుద్యోగ యువకులు డిగ్రీలు చదివి పట్టాలు చేత పట్టుకొని ఉద్యోగాలు రాలేదని కాలాన్ని వృధా చేసుకుంటూ గ్రామాలలో ఖాళీగా తిరుగుతున్న వారు అనేక మంది ఉన్నారు. వారు చదువుకున్న కోర్సులలో ఉద్యోగ అవకాశాలు లేకుంటే ఇతర రంగాలలో ప్రయత్నం చేసి ఉద్యోగం సాధించుకోవచ్చు. అలా కాకుండా యువత వివిధ చెడు వ్యసనాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారు. అలాంటి నిరుద్యోగ యువతకు ఆర్మీ డిఫెన్స్ రక్షణ రంగాలలో సువర్ణ అవకాశం కల్పించడం కోసం ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్ వారు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నారు. హాస్టల్ వసతి కూడా కల్పిస్తున్నారు. నిరుద్యోగ యువతకి డిఫెన్స్ రంగం కల్పిస్తున్న గొప్ప అవకాశం. తెలంగాణ రాష్ట్ర గ్రామాలలో ఆర్థిక సమస్యలు, కుటుంబ పరిస్థితుల వలన పై చదువులు చదువుకోలేక, కంపెనీలలో కార్మికులుగా, వ్యవసాయ కూలీలుగా మారుతున్న యువతకి ఇండియన్ డిఫెన్స్ రంగం ద్వారా యేటా వెలువబడుతున్న నోటిఫికేషన్స్ ద్వారా మంచి అవకాశాలను కల్పిస్తుంది. కాబట్టి యువత జీవితానికి భరోసా రక్షణలేని, కంపెనీలలో మరియు కూలీలుగా మారే కన్నా డిఫెన్స్ రంగంలో చేరి తమ ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకుంటూ కుటుంబాలను పోషించుకుంటూ, దేశానికి సేవ చేసే అదృష్టం లభిస్తుంది. దానితోపాటు సమాజంలో గౌరవం పొందడంతో పాటు దేశానికి భద్రత కల్పిస్తున్నామనే సంతృప్తి పొందవచ్చు. ఒకసారి డిఫెన్స్ రంగంలో చేరిన తర్వాత వారిలో ఉన్న నైపుణ్యతను బట్టి ఆయా సంస్థలు ఉన్నంత పోస్టుల కొరకై సొంత ఖర్చులతో ట్రైనింగ్ ఇచ్చి ప్రోత్సహిస్తుంది. తాను రక్షణ రంగంలో పని చేయటం వలన వారి కుటుంబం ఆరోగ్యానికి సంబంధించిన మెడికల్ ఖర్చులు భరించడంతోపాటు, క్యాంటీన్ ఫెసిలిటీస్ కలిపిస్తుంది. కాబట్టి గ్రామాలలో ఉన్న యువత ఆర్థిక కారణాల వలన విద్యకు దూరం అవుతున్నవారు, డిఫెన్స్ రంగంలో పని చేయాలనుకునేవారు ఇండియన్ డిఫెన్స్ రంగంలో చేరి తన భవిష్యత్తును భద్రం చేసుకోవడంతో పాటు తమ కుటుంబానికి రక్షణగా నిలుస్తూ ఈ సమాజంలో క్రమశిక్షణతో కూడిన జీవితంతో ఈ సమాజానికి ఆదర్శంగా నిలవాలి. ముఖ్యంగా భారత సర్కార్ ద్వారా తెచ్చిన అగ్నిపథ్ స్కీం ద్వారా యువతకి చిన్న వయసులోనే జాబ్‌తో పాటు క్రమశిక్షణ, ఆర్థిక భద్రత కల్పించడం జరుగుతుంది. అగ్నిపథ్ స్కీం ద్వారా ఇండియన్ డిఫెన్స్ రంగంలో చేరిన యువతకి మంచి వేతనంతో పాటు, అగ్నిపథ్ స్కిల్ సర్టిఫికెట్, పై తరగతి సర్టిఫికెట్‌తో పాటు సేనానిధి ద్వారా దాదాపుగా 15 లక్షలు ఇవ్వడం జరుగుతుంది. అగ్నిపథ్ స్కిల్ సర్టిఫికెట్ భారత రక్షణ దళాల్లో చేరడానికి 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగంలో చేరడానికి ఉపయోగపడటమే కాకుండా పై తరగతి సర్టిఫికెట్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వెలుపడే ఉద్యోగాలలో చేరడానికి ఉపయోగపడుతుంది. సేననిధి ద్వారా ఇవ్వబడిన డబ్బులతో స్వయం ఉపాధి కోసం ఏదైనా వ్యాపారం చేయడానికి పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. ఇన్ని రకాల అవకాశాలు కల్పిస్తున్న ఇండియన్ డిఫెన్స్ రంగంలో చేరి యువత తమ జీవితాలను బాగు చేసుకోవడంతో పాటు ఈ సమాజం అభివృద్ధిలో తమ తోడ్పాటు అందించవచ్చు...

ఆజాద్ డిఫెన్స్ అకాడమీ గజ్వేల్ 2015 సంవత్సరంలో స్థాపించబడింది. ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రం, ఆజాద్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ మహమ్మద్ షఫి మార్గనిర్దేశంలో యువకులకు ఉచితంగా శిక్షణ కల్పిస్తూ ఎంతో మదిని దేశ రక్షణ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తున్నారు. ఆజాద్ డిఫెన్స్ అకాడమీ సంస్థ నుంచి ఇప్పటి వరకు 40 మంది జవాన్లుగా మారి దేశంలో వివిధ ప్రాంతాల్లో సేవలందించడం ఎంతో గర్వకారణం. కాబట్టి గజ్వేల్ పట్టణ,గ్రామీణ, చుట్టూ ప్రక్కల ప్రాంతానికి చెందిన యువత ఆజాద్ డిఫెన్స్ అకాడమీలో కోచింగ్ తీసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకొని గొప్ప పేరు సాధించుకోవచ్చు. కాబట్టి యువత ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని రక్షణ రంగంలో చేరి దేశానికి సేవ చేస్తే, మీ జీవితాలు బాగుపడటంతో పాటు మీ కుటుంబానికి అండగా ఉన్నవారు అవుతారు...



దేశానికి సేవ చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తా
-ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీలా చంద్రం.



దేశానికి సేవ చేయడం నేను ఎంతో అదృష్టంగా భావిస్తానని గత 15 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాలలో రక్షణ విభాగంలో ఆర్మీ జవాన్ గా పని చేశాను. ఇటీవల ఆర్మీ జవాన్ గా రిటైర్ కావడం జరిగింది. 2015 సంవత్సరంలోనే ఆజాద్ డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 40 మంది ఆర్మీ జవాన్లను తయారు చేయడం జరిగిందన్నారు. యువత ఉద్యోగ అవకాశాలు లేవని నిరుత్సాహంతో కలియుగ గ్రామాలలో తిరుగుతున్నారని అలాంటి వారిని అన్ని రకాలుగా ప్రోత్సహించి, ఉచితంగా శిక్షణ ఇస్తూ హాస్టల్ వసతి కల్పించి దేశ రక్షణ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా మా అకాడమీ శిక్షణ ఇస్తుందన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే సైనికులే కారణం
ఆజాద్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ మహమ్మద్ షఫి.



140 కోట్ల మంది ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారంటే దేశ బార్డర్ లో చలి వాన ఎండ లెక్కచేయకుండా కాపలా కాస్తున్న ఆర్మీ జవాన్, దేశ సైనికులే కారణమన్నారు. దేశం కోసం దేశ ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాపల కాస్తుంటారు. అలాంటివారిని పూర్తిగా తీసుకొని యువత దేశ రక్షణకు నడుం బిగించాలి. దేశం కోసం ప్రజల కోసం మేము సైతం అంటూ ముందుకు వచ్చే యువతకు ఆజాద్ డిఫెన్స్ అకాడమీ సువర్ణ అవకాశం కల్పిస్తుందని ఈ అకాడమీ ద్వారా ఇచ్చిన పొంది దేశ రక్షణ రంగంలో ఉద్యోగాలు సాధించుకునే అవకాశం ఉంది. కాబట్టి యువత కాలాన్ని వృధా చేయకుండా జీవితాన్ని స్వర్ణ యుగంగా మార్చుకోవాలి.

భారతమాత ఋణం తీర్చుకోవడమే లక్ష్యం
అగ్ని వీర్ భాను పసాద్



గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామానికి చెందిన పిట్ల ముత్యాలమ్మ -కిష్టయ్య దంపతుల ఏకైక కుమారుడు పిట్ల భానుప్రసాద్. 2022 సంవత్సరంలో ఆర్టిలర్ రెజిమెంట్‌లో అగ్ని వీర్‌గా చేరాడు. ప్రస్తుతం జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలో పుంచు సెక్టార్‌లో పనిచేయడం జరుగుతుంది. ఏకైక కుమారుడైన భాను ప్రసాద్‌ను దేశసేవ కోసం ఆర్మీలో చేర్పించిన వారి తల్లిదండ్రులు ఈ సమాజానికి ఆదర్శం. కాగా చిన్న వయసులోనే దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో దేశ సరిహద్దులకు పోయిన భాను ప్రసాద్‌ని గ్రామస్తులు ఎంతో అభినందించారు. దేశానికి సేవ చేసి భారతమాత రుణం తీర్చుకోవడమే తన లక్ష్యంగా బార్డర్‌లో పనిచేస్తున్నాను.

ఇండియన్ నేవీలో అగ్ని వీర్ గా సేవన్ అందించడం గర్వకారణం.
-ఇండియన్ నేవీ అగ్నివీర్ తనుష్.



రాయపోల్ మండలంలోని మొట్టమొదటి ఇండియన్ నేవీలో అగ్నివీర్‌గా ఎంపికైనందుకు ఎంతో గర్వంగా ఉందని ఎంతోమంది యువకులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ సేవకు కట్టుబడి ఉద్యోగం చేయడం జరుగుతుందన్నారు. రాయపోల్ మండలం మంతుర్ గ్రామానికి చెందిన స్వప్న- మహేష్ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు తనుష్ 2023 జూన్ మాసంలో ఇండియన్ నేవీలో అగ్ని వీర్ గా చేరడం జరిగింది. రాయపోల్ మండలం నుండి మొదటి నేవీ వారియర్స్ గా చేయడం చాలా గర్వకారణంగా, సంతోషకరంగా ఉందని తెలిపాడు.

దేశానికి సేవ చేయడం ఎంతో గర్వంగా ఉంది.
-ఆర్మీ జవాన్ పాపని కీర్తి కుమార్.



సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పాపని పోచవ్వ-పోచయ్య దంపతుల చిన్న కుమారుడు పాపని కీర్తి కుమార్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా 2022 లో అగ్ని వీర్‌గా మద్రాస్ ఇన్ ఫంట్రీ రెజిమెంట్‌లో చేరాడు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో చైనా సరిహద్దుల్లో పనిచేయడం జరుగుతుంది. మారుమూల గ్రామంలో జన్మించిన తనకు దేశ సరిహద్దుల్లో పనిచేసే అవకాశం దొరకడం చాలా సంతోషంగా ఉందని కీర్తి కుమార్ తెలిపారు. దేశానికి సేవ చేయడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.

అక్షర క్షేత్రం...భక్తజన సంద్రం

- వైభవంగా మూల మహెూత్సవం

నవతెలంగాణ-వర్గల్

వర్గల్ శ్రీ విద్యాధర క్షేత్రంలో ఆదివారం మూల నక్షత్ర విశేష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, పుష్పార్చన, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మూల మహెూత్సవానికి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేయగా శ్రీ విద్యాధరి శనీశ్వర, లక్ష్మీ గణపతి, కళ్యాణ వెంకటేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, చంద్రమౌళీశ్వర స్వామి క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. దీంతో ఆలయాల సముదాయం అమ్మవారి నామస్వరలతో మార్మోగుతూ ఆధ్యాత్మికత వెల్లువిరిసింది.



ఘనంగా ప్రారంభమైన బొడ్రాయి వార్షికోత్సవం

నవతెలంగాణ-కొండపాక

మండల పరిధి లోని బందారం గ్రామం లో మహంకాళి, దుర్గమ్మ, బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. మొదటి రోజున గ్రామంలోని మహంకాళి, పోచమ్మ దేవతలకు బోనాల సమర్పణ చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు,పెద్దలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొడుకు మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి ఆత్మహత్య

నవతెలంగాణ-వర్గల్



కొడుకు మరణాన్ని జీర్ణచుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్గల్ మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ గ్రామానికి చెందిన షాదు (32) మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు శశికాంత్ (10) చిన్న కొడుకు యశ్వంత్ (5). చిన్న కుమారుడు యశ్వంత్ గత కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఆక్సిడెంట్‌లో మరణించాడు. కొడుకు మరణించినప్పటి నుంచి షాదు మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎప్పుడు యశ్వంత్ ప్రస్తావన తీస్తూ బాధపడేవారు. శనివారం రోజున షాదు మద్యం సేవించి ఇంటికి వచ్చి యశ్వంత్‌ని గుర్తుచేసుకొని బాధపడ్డాడు. తరువాత రాత్రి 9 గంటలకు భోజనం చేసి పడుకున్నారు. మధ్యరాత్రి షాదు తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. షాదు మరణించినట్లు గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. కొడుకు మరణాన్ని జీర్ణచుకోలేకే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య మాధవి తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు గౌరారం ఎస్సై శివ కుమార్ తెలిపారు.

గ్రామాన్ని సందర్శించిన మిషన్ భగీరథ డిఈ కృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేట రూరల్





మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో నీటి ఎద్దడి సమస్యల వివరిస్తూ ఆదివారం 'నవతెలంగాణ'లో అధికారులు అశ్రద్ధ ప్రజల అవస్థలు కథనం ప్రచురితమైంది. వెంటనే 'నవతెలంగాణ ' కథనానికి స్పందించిన మిషన్ భగీరథ డిఈ కృష్ణ అధికారులతో కలిసి తోర్నాల గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గ్రామ ప్రజలతో సమస్యలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్ల వచ్చేటట్టు చూస్తామని మినీ ట్యాంకుల ద్వారా నీళ్లను అందిస్తామని, ఎక్కడ కూడా నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. వీరి వెంట ఏఈ ఆసిఫ్, పంచాయతీ కార్యదర్శి మమత, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఎల్‌ఓసి

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన కోట.శ్రీనివాస్, కుమారుడు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో రూ.1,50,000 ఎల్‌వోసిని బాధితునికి. బీఆర్ఎస్ నాయకులు నల్లా బాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచులు గవ్వల గణేష్, బొద్దుల చంద్రమౌళి, యూత్ ప్రెసిడెంట్ నీరటి రమేష్‌లు అందజేశారు.

జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆధ్వర్యంలో పోటీలు


నవతెలంగాణ -నంగునూరు



తెలంగాణ రాష్ట్ర బ్లాక్ బెల్ట్ మూడవ రౌండ్ గ్రైవింగ్ టెస్ట్ ఆదివారం నంగునూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలకు నాలుగు జిల్లాల నుంచి 40 మంది విద్యార్థులు హాజరయ్యారు .ఈ పోటీలలో కిహాన్ కథ, కుమ్మితే తదితర అంశాల్లో పోటీలు జరిపామని, నంగునూరు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని స్థానిక ఇన్స్ట్రక్టర్ సొప్పరి ఎల్లాదాస్ తెలియజేశారు. ఈ పోటీలకు రాష్ట్ర అధ్యక్షులు సెన్సాయి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్, టెక్నికల్ డైరెక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

మీర్జాపూర్‌లో బెల్లి లలితక్క 25వ వర్ధంతి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



తెలంగాణ గాన కోకిల, మలిదశ తెలంగాణ ఉద్యమ అమరురాలు గద్దర్ బెల్లి లలితక్క 25వ వర్ధంతిని ఆదివారం హుస్నాబాద్ మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో జేఏసీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ మలి దశ తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యం పరిచిందన్నారు. తెలంగాణ ఉద్యమ వ్యతిరేకులు బెల్లి లలితక్కను 17ముక్కలు చేసి గోనె సంచులలో కట్టి చెరువులు, కుంటలలో వేశారన్నారు. స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ కార్మికురాలుగా అనేక పోరాటాలను నిర్వహించిందన్నారు. మహిళా సంఘాన్ని ఏర్పాటు చేసి, భువనగిరిలో మహిళా సమస్యలను పరిష్కారం చేస్తూనే, బస్తీ వాసుల సమస్య లను పరిష్కరించిందన్నారు. వేశ్యవృత్తిలో మగ్గిన మహిళలను చైతన్యం చేసి, ఆ వృత్తిని మాన్పించిందన్నారు. తెలంగాణ జనసభ ఆధ్వర్యంలో తెలంగాణ కళాసమితి కోకోన్వీనర్‌గా ఉంటూ అనేక ఉద్యమాలను నిర్వహించిందన్నారు. బెల్లి లలితక్క విగ్రహన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టాలని, భువనగిరి జిల్లాకు లలితక్క పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ భాద్యులు ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, గొర్లవీరన్న యాదవ్, మల్లం నరసింహ, సందేబోయిన రమేష్, సంపత్, రాగుల శ్రీనివాస్, దిలీప్, సందేబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన చైర్మన్

నవతెలంగాణ- గజ్వేల్



మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డుకు చెందిన అటుకూరి నరసింహులు (39) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల బాధ్యత చూడాల్సిన వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే వాళ్ళ కుటుంబం రోడ్డున పడుతుందని, ఆర్థిక సమస్యలు ఇతర సమస్యలు ఉంటే చర్చించుకోవాలి తప్ప ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. నర్సింలు కుటుంబాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పరామర్శించి, ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట స్థానిక కౌన్సిలర్ బొగ్గుల చందు, వార్డ్ అధ్యక్షులు బాకీ స్వామి, వార్డ్ సభ్యులు అటుకూరి స్వామి, పొన్నాల కుమార్, దయ్యల నర్సింలు, మైస ఎల్లం, ప్రవీణ్ క్యాసరం కృష్ణ, సంజీవ్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

శివకుమార్ మృతి బాధాకరం

నవతెలంగాణ-రాయపోల్



బీఆర్ఎస్ కార్యకర్త శివకుమార్ అతిపిన్న వయసులో గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాయపోల్ మండల కేంద్రంలో అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన బ్యాగరి శివకుమార్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం నాయకులు అనుమాండ్ల రాజిరెడ్డి, ఉమ్మడి దౌల్తాబాద్ ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు అహ్మదీపూర్ రాజు గౌడ్, రాయపోల్ ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు పుట్ట రాజు లు మాట్లాడుతూ బ్యాగరి శివకుమార్ దళిత బహుజన ఉద్యమాలలో, అంబేద్కర్ సేవా సమితి నిర్వహించే ప్రతి కార్యక్రమంలో అలాగే బీఆర్ఎస్ పార్టీలో ఎంతో క్రియాశీలకంగా పనిచేయడం జరిగిందన్నారు. శివ కుమార్ సోదరుడు రవి కూడా 14 యేండ్ల చిన్న వయసులోనే మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. వారి తల్లిదండ్రుల గర్భశోకం తీర్చలేనిదన్నారు. శివకుమార్ కుటుంబ సభ్యులకు మనమందరం అండగా నిలిచి మనోధైర్యాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సమితి సభ్యులు బ్యాగరి స్వామి, పుట్ట బాలకృష్ణ, రజినీకాంత్, స్వామి, కరుణాకర్, పుట్ట నవీన్, బాలకృష్ణ, లింగం, అజయ్, నవీన్, శ్రీకాంత్, సాయికుమార్, నాగరాజు, వంశీ, రాజు, శేఖర్, రాజు, పర్ష రాములు, సతీష్, విష్ణు, లింగం, దేవరాజ్, భాను ప్రసాద్, భాను,రమేష్, చింటూ, రాములు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు పెట్టొద్దని తెలువదా... చెట్లు కొట్టొద్దని తెలువదా...

- ప్రజల కోసమే మేము పని చేస్తున్నాం విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు

నవతెలంగాణ-సిద్దిపేట

విద్యుత్ శాఖ చట్టాలు, నియమాల ప్రకారం విద్యుత్ తీగల వరకు పెరిగే చెట్లను నాటవద్దని మున్సిపల్ అధికారులకు తెలువదా...? హరితహారంలో నాటిన మొక్కలను కొట్టి వేయవద్దని విద్యుత్ శాఖ అధికారులకు తెలవదా...? ఇలా ఇరు శాఖల మధ్య కోల్డ్ వార్ సిద్దిపేటలో నడుస్తున్నది. ఈ మధ్య విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలోని పలు వార్డులలో విద్యుత్ వైర్లకు తగులుతున్న, తగలడానికి వచ్చిన చెట్ల కొమ్మలను నరికి వేశారు. కొన్ని ప్రాంతాల్లో చెట్లకు మధ్య కాండం వరకు తొలగించారు. దీంతో మున్సిపల్ అధికారులు చెట్లను కొట్టివేసినందుకు నష్టపరిహారంగా రూ.24 లక్షలు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ ఎస్ఈకి నోటీసులు పంపించింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు కూడా విద్యుత్ నియమ నిబంధనలను పాటించనందుకు, చెట్ల మూలంగా తమకు జరిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారో చెప్పాలంటూ మున్సిపల్ అధికారులకు నోటీసులు ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఇరుశాఖల విషయం జిల్లా కలెక్టర్ వరకు వెళ్లినట్లు సమాచారం. పై అధికారుల సూచనలతో ఇరు శాఖల మధ్య సమన్వయం జరుగుతుందా, ఘర్షణ వాతావరణం ఉంటుందా వేచి చూడాల్సిందే.

400 చెట్లను తొలగించారు...

హరితహారంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని 43 వార్డులలో మున్సిపల్ అధికారులు చెట్లను నాటారు. కాగా ఈ మధ్యనే విద్యుత్ శాఖ అధికారులు 400 చెట్ల వరకు తొలగించారని, ఒక్క చెట్టుకు సంవత్సరానికి రూ.500 ఖర్చు అవుతుందని, 6 సంవత్సరాల వయసు గల చెట్లకు రూ.3 వేలు ఖర్చయిందని, 400 చెట్లకు రూ.12 లక్షలు నష్టం జరిగిందని, దానికి రెండు రెట్లు రూ .24 లక్షలు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ అధికారులకు నోటీసులలో వివరిస్తూ పంపించారు.



విద్యుత్ తీగల కింద పెట్టినందుకు చర్యలు....

విద్యుత్ చట్టాల ప్రకారం స్తంభాలకు మధ్య ఉండే తీగల కింద పెద్ద చెట్లను నాటడానికి వీలు ఉండదు. అవి తెలిసి కూడా సిద్దిపేట పట్టణంలోని అన్ని వార్డులలో తీగలకు తాకే విధంగా పెరిగే చెట్లను నాటడం, మరి ముఖ్యంగా ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరమని తెలిసినా కోనో కార్పస్ మొక్కలు నాటిన మున్సిపల్ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని వారి వివరణ కూడా తెలుసుకోనున్నట్లు, మున్సిపల్ అధికారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి...

పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందివ్వడానికి మున్సిపల్ అధికారులు చెట్లు నాటారు. ప్రజలకు నిత్య అవసరమైన విద్యుత్తును అందించడానికి విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. ఇరు శాఖలు కూడా ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రజలకు సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఈ మధ్యనే సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు విద్యుత్ అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని చెప్పడంతో, విద్యుత్ శాఖ అధికారులు అందుకనుగుణంగా ప్రజలకు ముందుగానే తెలియజేస్తూ, విద్యుత్ సరఫరాను నిలిపివేసి, విద్యుత్ సరఫరాకు ఆటంకంగా మారిన చెట్లను తొలగిస్తున్నారు. కానీ కొంత సమన్వయ లోపంతో చెట్లను మధ్య వరకు తొలగించడం ఇరు శాఖల మధ్య కొంత ఘర్షణ వాతావరణం తీసుకువచ్చిందని చెప్పవచ్చు. విద్యుత్తు తీగల కింద చెట్లను నాటకుంటే ఇలాంటి ప్రమాదం ఏమి జరగదు...? పెరిగిన చెట్లను కొమ్మలను మాత్రమే తొలగించితే ఎలాంటి గొడవ ఉండకపోతుండే...? కానీ ఇరు శాఖల సమన్వయ లోపం వల్ల నోటీసులు ఇచ్చుకునే స్థాయికి వెళ్ళిందని పట్టణ ప్రజలు అనుకుంటున్నారు. పై అధికారులు స్పందించి వీరి మధ్య సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం













నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2006-2007 లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేశారు. అనంతరం వారి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

నవతెలంగాణ-కొండపాక

కుకునూర్ పల్లి మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో 1999-20 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలు ఆదివారం రిమ్మనగూడలోని ఓ ప్రైవేట్ హెూటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులకు సన్మానం చేశారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో 2003-2004లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యను అందించిన గురువులకు సన్మానం నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు వారి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, మోహన్‌రావు, లక్ష్మీనారాయణ, నారాయణరెడ్డి, రాజేశం, లక్ష్మారెడ్డి, కనుకయ్య, శంకర్, వెంకట్ రెడ్డి, శకుంతల, ఎంఎస్ శ్రీనివాస్, లింగారెడ్డి, మోహన్, శ్రీనివాస్, సంపత్, పరమేష్, విజయ్ కుమార్ పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ- గజ్వేల్

పాత జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులు ఒకచోట కూడి వాటిని నెమరు వేసుకున్నారు. 1996-97 పదవ తరగతి గది విద్యార్థులు ప్రజ్ఞాపూర్‌లో చదువుకున్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం గజ్వేల్ సమీపంలో ఓ రిసార్ట్‌లో ఏర్పాటు చేసుకున్నారు. తమతోపాటు విద్యాబోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులను ఆహ్వానం పలికి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు తరగతి గదిలో జరిగిన విషయాలను చర్చించుకుంటూ సంతోషంగా రోజంతా గడిపారు. ప్రస్తుతం పూర్వ విద్యార్థుల 60 కుటుంబాలు ఏ పొజిషన్లో ఉన్నాయో ఏం చేస్తున్నారో ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను సైతం విద్యార్థులు గురువుల గురించి అడిగి తెలుసుకుని వారికి పాదాభివందనం చేశారు. మీరు చెప్పిన విద్యాబుద్ధులు ఒక స్థాయికి చేర్చినట్లు పూర్వ విద్యార్థులు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు కొండల్ రెడ్డి, రామచంద్రరావు, ధర్మపురి లక్ష్మణ స్వామి, శంకర్, రామ్ రెడ్డి, కేశవరెడ్డి, కాశీనాథ్, జైపాల్ రెడ్డి, రఘుపతి, మామిడి నరసయ్య గౌడ్ పూర్వ విద్యార్థుల సమ్మేళన హాజరై వారిని దీవించారు. పూర్వ విద్యార్థులు వెంకటాచారి, రమేష్, నర్సింలు, మైపాల్ రెడ్డి, అశోక్ కుమార్, భాస్కర్, బాలకృష్ణ, నర్సింలు, మల్లేశం, శ్రీనివాస్, నవీన్, పోష గౌడ్, ఎల్లేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ18 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు మిరుదొడ్డి మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హల్‌లో ఆనందంగా గడిపారు. తమ స్నేహ బంధాలను గుర్తుకు తెచ్చుకుని సందడి చేశారు. మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి విద్యాలయంలో పదో తరగతి విద్యాభ్యాసం చేసిన 2005-2006 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాలలో, ఉద్యోగాలలో స్థిరపడిన వారంతా 18 సంవత్సరాల తదుపరి ఒక్కచోట చేరారు. తమకు అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు జ్ఞాపికలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఏ ఏ సబ్జెక్టు టీచర్లు ఎలా బోధించారో గుర్తు చేస్తూ, తమదైన శైలిలో ప్రసంగించారు. నాడు బోధించిన సంస్కారమే నేడు సమాజంలో రాణిస్తున్నామంటూ ఉపాధ్యాయులు చేసిన సేవలను కొనియాడారు. విద్య బుద్ధులు నేర్పిన గురువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు మహిపాల్ రెడ్డి, ర్యాకం మల్లేశం, మాలే రమేష్, శివకుమార్, ఆనంద్, వెంకటేష్, శేఖర్, ప్రకాష్, పూర్వ విద్యార్థులు శ్రీలత, కళ్యాణి, లావణ్య బబిత, మమత, లత, రేణుక, స్వాతి, సంపత్, కొండల్ రెడ్డి, కుమార్, రాజు, స్వామి, రమేష్, శ్రీకాంత్, భానువికాస్, పోచయ్య, ఆంజనేయులు, రాంబాబు, వీరాంజనేయులు, శశీకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తామంత ఐక్యంగ ఉంటు.. స్నేహితుల కష్ట సుఖాల్లో ఒకరికొకరు సహకారం అందించుకుంటు అండగా ఉంటామని 1993-94 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం శుభం గార్డెన్స్ లో ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఏకభిప్రాయానికి వచ్చారు. మూడు దశాబ్దాల గురు శిష్యుల బంధానికి నాటి విద్యార్థుల చిన్నారి స్నేహానికి చిరునామాగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులను ఈ వేడుకకు పిలుచుకొని నాటి వారి సేవలను కొనియాడారు, మరణించిన తమ గురువులు, స్నేహితులకు శ్రద్ధాంజలి ఘటించారు. తమ చిన్ననాటి స్నేహితులతో కబుర్లు, ఆట పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సమాజ సేవలో వాసవిక్లబ్

నవ తెలంగాణ-గజ్వేల్

సమాజ సేవలో వాసవి క్లబ్ ముందుకు వెళ్తుంది. క్లబ్ నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన జగ్గయ్యగారి శేఖర్ గుప్తా ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రిల్, మే నెలలో వేసవి ఎండలు దృష్టిలో పెట్టుకొని ప్రజలకు , పాదాచారులకు, ప్రయాణికులకు అంబలి కేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు, అన్నదాన కార్యక్రమాలు, ఉచిత చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంకా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో కార్యక్రమాలు అనేక నిర్వహిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వాసవి క్లబ్ సేవలు అంతంతగా నడిచినప్పటికీ జగ్గయ్యగారి శేఖర్ గుప్తా బాధ్యతలు తీసుకున్న తర్వాత క్లబ్బు సేవలు ఊపందుకున్నాయి. వాసవి క్లబ్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుంది. వేసవి ఎండలకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టి శేఖర్ ప్రజలకు వాసవి క్లబ్ సేవల ద్వారా దగ్గరవుతున్నారు. గ్రామాల్లో నిరుపేదలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనేకమంది పేదలకు వాసవి క్లబ్ ద్వారా సేవలందిస్తున్నారు. అంబలి, మజ్జిగ, అన్నదానం కేంద్రాల ద్వారా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పాదాచారులకు కాకుండా అంగడి హనుమాన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల ద్వారా దౌల్తాబాద్, రామాయంపేట, తొగుట మండలాలకు వెళ్లే ప్రజలకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పాలి. అంతేకాకుండా పేదలకు సాయం చేయడం తనకు సంతోషంగా ఉంటుందని శేఖర్ చెప్పారు. తనకున్న దాంట్లో పేదలకు పంచడం సంతోషాన్నిస్తుందన్నారు. తాను ఒక్కరే కాకుండా వాసవి క్లబ్‌లో సభ్యులుగా ఉన్న వారందరూ ఏకతాటిపైకొచ్చి సేవలు చేస్తున్నారని శేఖర్ 'నవ తెలంగాణ'తో తెలిపారు. మంచి కార్యక్రమాన్ని మీడియా సైతం ప్రోత్సహిస్తుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు వాసవి క్లబ్ ముందుంటుందన్నారు.



ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పుట్టినిల్లు సిద్దిపేట

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పుట్టినిల్లు సిద్దిపేట అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కోమటి చెరులో హనుమాన్ తెప్పోత్సవం శనివారం రాత్రి శ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గాప్రసాద్ స్వామీజీ వచ్చి మన అందరినీ ఆశీర్వదించారు. ఆరేళ్లుగా ఈ ఉత్సవం చేసుకుంటున్నామన్నారు. ప్రతి ఏటా వాయు దేవుడు, వరుణ దేవుడు ఈరోజున మనల్ని ఆశీర్వదిస్తున్నారని, వర్షం కురిపిస్తున్నారన్నారు. హనుమాన్ దీక్ష మొదటి సారి 1982 సిద్దిపేటలో ప్రారంభమైందని, 46 రోజుల భిక్ష కూడా ఇక్కడే ప్రారంభమైందన్నారు. ఇక్కడ ప్రారంభమై దేశవ్యాప్తం అయిందన్నారు. ఇంత ఎండలు ఉన్నా కోమటి చేరు మత్తడి దుంకుతున్నదని, స్వచ్ఛమైన కాళేశ్వర జలాలు ఏడాది పాటు మనకు అందాయని, తెప్పోత్సవం అంటే ఒకప్పుడు రాజమండ్రికి వెళ్ళేవాళ్ళమని, కానీ మన రాష్ట్రంలో సిద్దిపేటలో జరుగుతుందటం సంతోషకరమన్నారు. దుర్గాప్రసాద్ స్వామీజీ మాట్లాడుతూ వేడుకగా ఆరో ఏటా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. హనుమాన్ మాల ధారణ చేసిన వారి వల్ల లోక కళ్యాణం జరగాలని, అందరికీ హనుమాన్ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయన్నారు. సమాజంలో అందరూ కలిసి జీవించాలని, హరీశ్ రావు ప్రజల మధ్య ఉండే వ్యక్తి అని ఆయనకు మంచి జరుగుతుందన్నారు. అనంతరం తెప్పోత్సవం నిర్వహించారు.

